పెద్దేముల్, అక్టోబరు 1: పెద్దేముల్ మండల పరిధిలో మండల కేంద్రంలో ఒకే ఒక గాంధీజీ విగ్రహం ఉంది. అది పూర్తిగా శిథిలమై కింద పడిపోయే పరిస్థితికి చేరింది. చేతిలో కర్రలేదు. విగ్రహం నిలబడే స్థితిలో లేదు. శిథిలమైన విగ్రహానికి తీగకట్టి నిలబడేలా చేశారు. ఆయన జయంతి, వర్ధంతి వచ్చినపుడు మాత్రం పలువురు రాజకీయ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఫొటోలు దిగి అక్కడితో మరిచిపోతున్నారు. శిథిలావస్థకు చేరినా కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామనే ఆలోచనే లేకుండా పోయింది. రాజకీయాల కోసం ఊరూరా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నా.. వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేస్తున్నారు. గాంధీ జయంతి రోజైనా పెద్దేముల్ మండల కేంద్రంలో నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రంగులకు నోచుకోని దుస్థితి

చేవెళ్ల: చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం పంచాయతీ సమీపంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం కనీసం రంగులకు నోచుకోవడం లేదు. చాలా సంవత్సరాల క్రితం గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న ఈ విగ్రహానికి రంగులు వేయకపోవడంతో వెలసిపోయి దర్శనమిస్తోంది. ఏడాదికి ఒకసారి జయంతివేడుకలు నిర్వహించినప్పటికి విగ్రహానికి మాత్రం రంగులు వేయడం మరిచారు. దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన మహనీయుడు జాతిపిత మహత్మా గాంధీజీ విగ్రహం జయంతి రోజైనా కనీస అలంకరణకు నోచుకోకపోవడం పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విరిగిన కర్రతో విగ్రహం


అవుషాపూర్‌లో చేతిలో విరిగిన కర్రతో..

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అవుషాపూర్‌లోని సాముహిక భవనం ఎదుట ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం చేతిలో కర్ర విరిగి చాలా రోజులు అవుతున్నా నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పట్టించుకోవడం లేదు. దీంతో విరిగిన కర్రతో గాంధీ విగ్రహం దర్శనమిస్తోంది. గతంలో ఈ విషయాన్ని గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా కర్రను మాత్రం మార్చలేదు. ఇప్పటికైన మహాత్ముడి విగ్రహం చేతిలో మంచి కర్రను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దపూర్, కల్కోడ గ్రామాల్లో ..


పెద్దపూర్ గ్రామంలో చేతిలో కర్ర లేకుండా, కల్కోడలో ఎడమచేయి విరిగి ఇలా..

మర్పలి : జయంతి వస్తే తప్ప మహాత్ముడి విగ్రహాల వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎవరూ కన్నెత్తి చూడరు. కొన్ని గ్రామాల్లో విగ్రహాలు విరిగిపోయినా పట్టించుకునేవారే కరువయ్యారు. కోరు. గాంధీ జయంతి సందర్భంగా అవే విగ్రహాలకు రంగులతో ముస్తాబు చేసి పూలమాలలు వేసి నివాళు లర్పించడం ఆనవాయితీ. మండలంలోని పెద్దపూర్, కల్కోడ గ్రామాల్లో గాంధీజీ విగ్రహాల చేతిలో కర్ర లేకుండా, చేయి విరిగి అందవిహీనంగా దర్శనమిస్తున్నాయి.

గాంధీ పార్క్‌లో సౌకర్యాలు నిల్


వికారాబాద్ గాంధీ పార్కు

వికారాబాద్: వికారాబాద్ పట్టణంలోని మున్సిపల్ పార్కు గాంధీ పార్కుగా ప్రసిద్ధి. 1954లో అప్పటి మున్సిపల్ చైర్మన్ ముద్ద వీరమల్లప్ప మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మున్సిపల్ పార్కును గాంధీ పార్కుగా పిలుస్తున్నారు.

ప్రాంతీయ వార్తల కోసం పార్కుకు

సాయంత్రం ఆరు అయితే చాలు పట్టణ ప్రజలు గాంధీ పార్కుకు వెళ్లేవారు. ఇక్కడ ఓ స్తంభానికి రేడియో ఏర్పాటు చేయించారు. సాయంత్రం 6.10 గంటలకు వచ్చే ప్రాంతీయ వార్తలు, రాత్రి 7.05 గంటలకు వచ్చే జాతీయ వార్తలు విన్న తర్వాతనే అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లేవారు. అప్పట్లో వికారాబాద్ పట్టణంలో పదిలోపే రేడియోలు ఉండేవి. తర్వాత కాలంలో రేడియోలు టీవీలు ప్రతీ ఇంటికి వచ్చేశాయి. దీంతో పార్కుకు వచ్చే వారికి సంఖ్య రోజు రోజుకు తగ్గుతూ వచ్చింది. ఈ పార్కులో సుమారు 30 సంవత్సరాల పాటు రేడియో ఎక్కడ జరిగిన విషయాలైనా ఈ ప్రాంత ప్రజలకు వినిపించింది. ఈ వార్తల కోసం పట్టణం మొత్తం అక్కడి వచ్చి వినే వారంటే అతిశయోక్తి కాదు.

కర్ణాటక, మహారాష్ట్ర ప్రయాణికులకు విడిది

పక్క రాష్ట్రాల వారు సైతం ఈ పార్కును విడిదిగా వాడుకునేవారు. కర్ణాటక, మహరాష్ట్ర నుంచి తిరుపతి వెళ్లడానికి వచ్చే ప్రయాణికులు ఉదయం వేళలో వికారాబాద్ రైల్వే జంక్షన్ దిగేవారు. రైళ్ల ఆలస్యంగా ఉన్నవారు పక్కనే ఉన్న గాంధీ పార్కులో సేదదీరేవారు. ఈ పద్ధతి ఇప్పటికీ కొనసాగుతున్నా.. భవిష్యత్తులో జహీరాబాద్ తాండూరు రైల్వేలైన్ పూర్తయితే వారు కూడా ఇక్కడికి వచ్చే అవకాశాలు తగ్గనున్నాయి.

సౌకర్యాలు కరువు

అయితే పార్కులో కనీస సౌకర్యాలు లేక పోవడంతో పార్కుకు వచ్చేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కులో తాగేందుకు నీటితో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా అక్కడి చెట్లపై ఉండే గబ్బిలాలు పార్కును పూర్తిగా పాడు చేస్తున్నాయి. ఏ రకమైన చర్యలు చేపట్టినా పరిస్థితి మారడం లేదు.

గాంధీ పేరుతో హిందీ పండితుడు



పరిగి, అక్టోబరు 1: వికారాబాద్ జిల్లా పరిగిలో మరో 'గాంధీ' ఉన్నారు. మహాత్ముడి స్ఫూర్తితోనే ఆయన తల్లి దండ్రులు ఆయనకు గాంధీజీగా నామకరణం చేశారు. దోమ మండల కేంద్రానికి చెందిన గుబ్బ కిష్టమ్మ, రాజయ్య దంపతులకు 1940లో మగ సంతానం పుట్టడం, చనిపోవడం జరుగుతూ వచ్చిందట. అలా ఈ దంపతుకుల నలుగురు మగసంతానం జన్మించిన తర్వాత అందరూ చనిపోయారట. జాతిపిత మహాత్మాగాంధీ 1948, జనవరి 30న చనిపోయారు. ఆ తర్వాత గుబ్బ కిష్టమ్మ, రాజయ్య దంపతులకు మరో సంతానం 1948, సెప్టెంబర్ 12న మగబిడ్డకు జన్మించారు. అప్పుడు ఆ తల్లిదండ్రులు జాతీపిత గాంధీజి స్ఫూర్తితో తమ ముద్దుల కొడుకుకి గాంధీ అని నామకరణం చేశారు. గాంధీ దోమలో ప్రాథమిక విద్య, పరిగిలో ఉన్నత విద్యను అభ్యసించగా హిందీ పండిట్ ఉద్యోగం వచ్చింది. గాంధీ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా 15 ఏళ్లగా హిందీ భాషా అభివృద్ధికి సేవలందిస్తున్నారు.

కులవృత్తుల నుంచి కార్పొరేట్ రంగాన్ని తొలగించాలి

ఎంఎస్ఎంఈ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 1: కుల వృత్తుల్లో కార్పొరేట్ రంగాన్ని నిర్మూలించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. బీసీ, ఎంబీసీల జీవనోపాధికి ఎంఎస్ఎంఈ 2024 పాలసీ సవరణలో బీసీలు, మహిళలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బీసీల ఆర్థిక స్వావలంబనకు ప్రణాళిక రూపొందించి ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ఫెడరేషన్లు నామ్‌కే వాస్తేగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఎంఎస్ఈఎం సమావేశానికి ఎమ్మెల్యేను ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వం ఆహ్వానించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవృత్తుల్లోకి కార్పొరేట్ రంగం రావడంతో బీసీల బతుకులు రోడ్డున పడుతున్నాయన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, వాటిని ఇతర అవసరాలకు దారిమళ్లించడం తప్ప పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. క్షౌరశాలలు, రజక వృత్తిలోకి కూడా కార్పొరేట్ కంపెనీలు రావడంతో నాయీ బ్రాహ్మణులు, రజకులు రోడ్డున పడ్డారన్నారు. పేదల పథకాలు, నిధులను బ్యూరోక్రాట్లు కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ, పేదల బతుకులతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. వడ్డెర వృత్తిలోకి కూడా కార్పొరేట్ రంగానికి ఎలా అనుమతులిస్తున్నారని ఉన్నతాధికారులను ఆయన ప్రశ్నించారు. మూసీ మాస్టర్ ప్లాన్‌లో రజకులకు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. కుల వృత్తులతో జీవిస్తున్న బీసీ, ఎంబీసీల బతుకులు ఆగమ్యగోచరంగానే మారాయాని, వారి సంక్షేమానికి కేటాయించిన నిధులను వారికే వెచ్చించాలని ఎమ్మెల్యే కోరారు.


హెచ్ఎం గోవిందును నిలదీస్తున్న గ్రామస్థులు

రక్షకుడే.. భక్షకుడు!

పాఠ్యపుస్తకాలు, బెంచీలు అమ్మజూసిన ప్రధానోపాధ్యాయుడు

పట్టుకొని నిలదీసిన గ్రామస్థులు

షాబాద్, అక్టోబరు 1: ఓ ప్రధానోపాధ్యాయుడు పాఠశాల వస్తువులను అమ్మి సొమ్ముచేసుకుంటుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. మంగళవారం షాబాద్‌లోని జడ్పీ బాలుర పాఠశాలలోని పాత పుస్తకాలు, బెంచీలు, ఇతర సామగ్రిని హెచ్ఎం గోవిందు అమ్మజూశాడు. దీంతో గ్రామస్థులు అతడిని నిలదీసి పోలీసులకు ఫిర్యాదు కోసం వెళ్లారు. ఈ లోపు హెచ్ఎం పాత పుస్తకాలు, సామగ్రిని అమ్మేందుకు ఈ నెల 23న తీర్మానించినట్లు రిజిస్టర్‌లో రాసి తోటి టీచర్ల సంతకాలు తీసుకున్నాడు. ఉపాధ్యాయులను నిలదీయగా.. మంగళవారమే సంతకాలు చేశామని అంగీకరించారు. దీనిపై డీఈవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులన్నారు. టీసీలకు, గెజిటెడ్ సంతకాలకు హెచ్ఎం రూ.500 వసూలు చేస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. బదిలీ అయిన టీచర్లకు సర్వీసు బుక్కులిచ్చేందుకు సైతం డబ్బు వసూలు చేశాడనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే హెచ్ఎం గోవిందు రాజేంద్రనగర్‌లో పనిచేసినప్పుడు కూడా బియ్యం, ఇతర సామాన్లు అమ్ముకున్నాడనే ఆరోపణలున్నాయి.

మహేశ్వరం ఏఎంసీ పాలకవర్గం ఎప్పుడు?

మహేశ్వరం, అక్టోబరు 1: ఏడు నెలలుగా మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక రైతులకు సేవలందడం లేదు. పాలకవర్గం ఏర్పాటుకు రైతులు ఎదురు చూస్తున్నా రు. మార్కెట్ కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని మహేశ్వరం, కందుకూరు మండలాల రైతు లు కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌ను, ఇతర నేతల ను ఆశ్రయిస్తున్నారు. ఏఎంసీలకు రిజర్వేషన్లను ప్రభుత్వం 2015-16లోనే ప్రకటించింది. ఇబ్రహీంపట్నం ఏఎంసీ నుంచి 2015లో ఏర్పాటైన మహేశ్వరం మార్కెట్ కమిటీకి రెండుసార్లు జనరల్ లేడీ, ఒకసారి జనరల్, నాలుగోసారి ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ లేడీకి రిజర్వ్ చేశారు. ప్రస్తుతం ఎస్టీ జనరల్‌కు చైర్‌పర్సన్ పదవి వరించనుంది. కందుకూరు, మహేశ్వరం మండలాల కాంగ్రెస్ నాయకులు పదవికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవి ఇప్పటికి మూడుసార్లు కందుకూరు మండల నేతలకే వరించింది. ఈసారి పదవి దక్కించుకునేందుకు మహేశ్వరం మండల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రేసులో ఉన్న గిరిజన నేతలు వీరే

మహేశ్వరం మండలానికి చెందిన అంగోత్ కృష్ణానాయక్, నెనావత్ రాజునాయక్, పాండునాయక్, అంద్యానాయక్, రాములునాయక్‌లు, కందుకూరు మండలానికి చెందిన ఆంజనేయులునాయక్, లచ్చ్యానాయక్, కృష్ణానాయక్ ఏఎంసీ చైర్మన్ పదవికి పోటీ పడుతున్నారు. కృష్ణానాయియక్, రాజునాయక్‌లు రాష్ట్రస్థాయి నేతలతో వారి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పాలకవర్గం ఏర్పాటులో కేఎల్లార్ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

డయల్ 100 ఫిర్యాదులపై నిర్లక్ష్యమొద్దు

మర్పల్లి, అక్టోబరు 1: డయల్ 100పై వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. మండలంలో అత్యధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కళాబృందాలతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్, మర్పల్లి ఎస్సై సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లగా బతకాలి.. అందరినీ బతికించాలి



ధారూరు, అక్టోబరు 1: చల్లగా బతకాలి.. అందరినీ బతికించాలనేది ప్రకృతి మనకు నేర్పించిన పాఠమని ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి తెలిపారు. ధారూరు బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎక్కడా లేని విధంగా పూలను పూజించే గొప్ప పండుగ అని, ఇది తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ లక్ష్మీ, ధారూరు జడ్పీ కార్యదర్శి అంజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం, సమీకృత వసతి గృహాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

- ముందుకు వచ్చిన హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్
- మోడల్ సమీకృత భవనానికి రూ.120కోట్లు
- కొడంగల్‌లో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు
- ఈ నెలలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం..!


సీఎంకు చెక్కు అందజేస్తున్న వీయాట్రిస్, హెచ్‌కేఎం ప్రతినిధులు


మార్కెట్ యార్డులో భవన నిర్మాణ పనులు

కొడంగల్, అక్టోబరు 1: రాష్ట్రంలో విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం, సమీకృత వసతి గృహల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. అందులో భాగంగా కొడంగల్‌లో పైలెట్ ప్రాజెక్టు ఎంపికతో సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కొడంగల్ శివారులోని పాత కొడంగల్‌లో 20 ఎకరాలు కేటాయించారు. ఇందుకు రూ.120కోట్లకు పైగా నిధులతో భవన నిర్మాణంతో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. హరేరామ, హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు కొడంగల్‌లో ప్రారంభించనున్నారు. ఇందుకు కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో దాదాపు రూ.11కోట్ల వ్యయంతో భవన నిర్మాణం పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఇప్పటికే రూ.6.4కోట్లు అల్పాహారం అందించేందుకు ఫౌండేషన్ సభ్యులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి విరాళం అందజేశారు. ఈ పథకాన్ని ఈ నెల చివరిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

చురుగ్గా కొనసాగుతున్న పనులు

కొడంగల్ మార్కెట్ యార్డు ఆవరణలో మధ్యాహ్న భోజనం, అల్పాహారం కోసం భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. అందుకు అవసరపడే నిధులు వీయాట్రిస్, హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా రూ.6.4కోట్లు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డికి అందించగా, సింగరేణి ద్వారా రూ.2కోట్లు హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో చేపడుతున్నారు. భవన నిర్మాణం, వంట యంత్రాలు, పాఠశాలలకు చేరవేసేందుకు ఆటోలకు నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గం నుంచి వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, నారాయణపేట్ జిల్లాలోని కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఫౌండేషన్ ద్వారా 312 పాఠశాలల్లోని 28వేల మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందనుంది.

సమీకృత గురుకుల ఏర్పాటు

కొడంగల్‌లో సమీకృత గురుకులాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మొదటగా కొడంగల్‌లో పూర్తి చేసి తాండూర్ ఇతర నియోజకవర్గాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను దౌల్తాబాద్, బురాన్‌పూర్ తదితర ప్రాంతాల్లో నిర్మాణానికి రూ.25కోట్లకుపైగా నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలోనే మోడల్‌గా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఒకే దగ్గర ఏర్పాటు చేసేందుకు సీఎం నిర్ణయించారు. ఇందుకు వసతి గృహల ఏర్పాటుకు కొడంగల్ శివారులోని పాత కొడంగల్‌లో 20ఎకరాల భూమిని కేటాయించారు. సమీకృత గురుకులాల ఏర్పాటు కోసం దాదాపు రూ.120 కోట్లకుపైగా నిధులు అవసరం ఉన్నట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్న భోజనం, అల్పాహారం, సమీకృత గురుకులాలతో పాటు ఇతరాత్ర పనులకు రూ.500 కోట్లకుపైగా నిధులతో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



వికారాబాద్:
భృంగీ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

వికారాబాద్, అక్టోబరు 1: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని భృంగీ విద్యాసంస్థల కార్యదర్శి ప్రమీల, చంద్రశేఖర్ అన్నారు. భృంగీ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను పేర్చి ఘనంగా వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి తలపైపెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. ఆట, పాటలతో సందడి చేశారు. అదేవిధంగా మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో, పరిగిలోని జడ్పీహెచ్ఎస్‌నెం.01 పాఠశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులకు దసరా సెలవులు ఉండటంతో ముందుగానే బతుకమ్మ సంబరాలను పాఠశాలల్లో నిర్వహించారు.

దౌల్తాబాద్: మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామంలో గల న్యూ మాస్టర్ మైండ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సతీశ్ ముదిరాజ్, నర్సింహులు, ప్రిన్సిపాల్ రాజాఅరుణ్, ఉపాధ్యాయులు బసంత్‌రెడ్డి, నాగరాజు, బాస్టిన్, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జడ్పీహెచ్ఎస్‌లో జీహెచ్ఎం శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువులో నిమజ్జనం చేశారు.



దౌల్తాబాద్: గోకఫస్లాబాద్ న్యూ మాస్టర్‌మైండ్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

దోమ: దోమ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, అధికారులు సుబ్రహ్మణ్యం, సోమలింగం, కిరణ్, హెచ్ఎం ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలను బొంరాస్‌పేట్, దుద్యాల మండల కేంద్రాల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటాపాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, హెచ్ఎం మల్లప్ప, రాములు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని జినగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. దసరా సెలవులు రావడంతో పాఠశాలలో విద్యార్థినులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడిపాడారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. అదే విధంగా కరన్‌కోట్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎంఏ బారీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను పాఠశాల ఆవరణలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: జడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. జానపద గాయినీ, నటి ఉషారాణి కార్యక్రమంలో పాల్గొని బతుకమ్మ జానపద గేయాలను ఆలపించి విద్యార్థులను ఉర్రూతలూగించారు. పూలతో తయారు చేసిన అందమైన బతుకమ్మలను ఒక వద్దకు పేర్చి విద్యార్థులు అధ్యాపకులు కలిసి బతకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి దంపతులు, కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం, డీన్ డాక్టర్ వెంకట్‌రావు, కన్వీనర్ శైలజారెడ్డి పాల్గొన్నారు.

కీసర రూరల్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ అని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి రాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కరీంగూడలో గల జూబ్లిపబ్లిక్ హైస్కూల్‌లో విద్యార్థులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. భారీ బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది నృత్యాలతో సందడి చేశారు. దసరా నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి వేషధారణ లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజా రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని హోలీ ఫెయిత్ గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినిలు సంప్రదాయ దుస్తువులు ధరించి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను ఎరిమల్లె వాగులో నిమజ్జనం చేశారు. ఉపాధ్యాయులను, విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ దర్గా జితేందర్‌రెడ్డి అభినందించారు.



పరిగి: శిశుమందిర్‌లో బతుకమ్మ సంబురాలు



మేడ్చల్ టౌన్:
బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



ఘట్‌కేసర్: హోలీ ఫెయిత్ గ్రామర్ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్, అధ్యక్షుడు



మంజుల, ప్రధాన కార్యదర్శి

వికారాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి ఎన్.శంకర్ అన్నారు. వికారాబాద్‌లో సోమవారం రాత్రి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఇంటర్ విద్యా నోడల్ అధికారిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు లెక్చరర్లు కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.రాజ్‌కుమార్ (పరిగి), ఉపాధ్యక్షుడిగా బి.మల్లినాథప్ప (తాండూరు), ప్రధాన కార్యదర్శిగా డి.మంజుల (నవాబుపేట్), సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ భాస్కర్ (పరిగి), కోశాధికారిగా డి.నరేష్ (నవాబుపేట్), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పండరి, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గంతో మాజీ అధ్యక్షుడు బుచ్చయ్య ప్రమాణ స్వీకారం చేశారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొడంగల్, అక్టోబరు 1: ఇండియన్ ఒలంపియాడ్ పరీక్షలో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు రబీయా జీనత్ రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించగా విశాల్ 23వ ర్యాంకును సాధించారు. టాపర్‌లుగా శివకుమార్, శరత్‌కుమార్ ప్రతిభ కనబర్చారు. మంగళవారం పాఠశాలలో పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష విద్యార్థులకు ప్రశాంస పత్రాలు, మెడల్స్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్థన్, అతీఖ్, శకుంతల, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

తాండూరు, అక్టోబరు 1: వీధి వ్యాపారులు తోపుడు బండ్లు, కూరగాయల దుకాణదారులతో రోడ్లను అక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి హెచ్చరించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం వీధి వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. ముఖ్యంగా ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఉందని, రోడ్డును ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్నారని, వారిపై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 1: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు పిర్యాదు చేశాడు. అన్నోజిగూడలోని సర్వేనెంబర్ 28లోని ప్లాట్‌నెంబర్ 24లో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని పిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన గల సర్వీసురోడ్డుకు అనుకోని నిర్మిస్తున్న భవనంలో రెండు అంతస్తులు అదనంగా నిర్మించడంతోపాటు సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా చేపట్టిన నిర్మాణంపై విచారణ జరిపాలని కోరారు.

డీఎస్సీ మొదటి ప్రయత్నంలోనే విజయం



శ్రీహరి

కొడంగల్ రూరల్, అక్టోబరు 1: మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన సి.శ్రీహరి సోమవారం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో 79.23మార్కులతో ఎస్టీటీ జిల్లా స్థాయిలో 10ర్యాంకు సాధించాడు. శ్రీహరి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం విశేషం. తన తండ్రి చిన్నతనంలో మరణించడంతో తల్లి సి.పద్మమ్మ కుటుంబ బాధ్యతలు చేపట్టి పిల్లలను చదివించింది. తన మేనమామ ఫిరంగి శ్రీనివాస్ సహకారంతో పట్టుదలతో చదివి డీఎస్సీలో 10ర్యాంకు సాధించానని శ్రీహరి తెలిపాడు.

దసరా ఉత్సవాలపై అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్ పర్సన్

వికారాబాద్, అక్టోబరు 1: దసరా ఉత్సవాల సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించి ఏజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణ ప్రజలకు స్ఫూర్తి ప్రదాత అయిన చీకటి మర్గ విశ్వనాథం మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి రావణ దహనం ఇతర ఏర్పాట్లు, గంగారం, కొత్తగడి, అనంతగిరిపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, దన్నారం, వెంకటాపూర్ తండా, ఎన్నెపల్లి, రాజీవ్ గృహకల్ప, శివరాం నగర్ మొదలైన కాలనీల్లో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ఏజెండాను మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వికారాబాద్ మునిసిపల్‌లో డీఈగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన డీఈ ప్రశాంత్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. కొత్తగా వచ్చిన డీఈ రాకేషన్ రెడ్డికు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో వెలసిన అమ్మవారి మండపాలు

ఘట్‌కేసర్ రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాత మండపాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు రంగురంగుల విద్యుద్దీపాలతో మండపాలను ఏర్పాటు చేశారు. అవుషాపూర్, అంకు శాపూర్, ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారం, ఘనాపూర్ తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాలు వెలశాయి. రేపటి నుంచి ఈ నెల 12వరకు జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి.

నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న ప్లాంటుపై దాడులు

● నాలుగు టన్నులు మొక్కజొన్న విత్తనాలు సీజ్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 1: నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌పై వ్యవసాయశాఖ అధికారులు దాడులు నిర్వహించి సుమారు రూ.30లక్షల విలువ చేసే 4వేల కిలోల మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశారు. మండలంలోని ఎల్లంపేట గ్రామ శివారులోని సమృద్ధి అగ్రిటెక్ పరిశ్రమలోని ప్రాసెసింగ్ ప్లాంటులో టాప్-సీ పరిశ్రమకు చెందిన టాప్-55 బ్రాండ్ మొక్కజొన్న విత్తనాలను ప్యాకింగ్ చేస్తున్నారు. కొరోనాసీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం మొక్కజొన్న విత్తనాలను ప్యాకింగ్ చేస్తున్నట్లు పక్కా సమాచారంతో మంగళవారం మేడ్చల్ వ్యవసాయ శాఖ ఏవో అర్చన, విజిలెన్స్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ టాప్-55 బ్రాండుకు చెందిన 1000 మొక్కజొన్న ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో ప్యాకెట్ బరువు సుమారు నాలుగు కిలోలు ఉంటుందని తెలిపారు. కాగా కొరోనా సీడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వ్యవసాయ శాఖ తరపున ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. అయినప్పటికీ విత్తనాలను శుద్ధిచేసి వాటిని ప్యాక్‌చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటంతో అధికారులు దాడులు నిర్వహించారు. మొక్కజొన్న విత్తనాలను సీజ్‌చేసి సదరు పరిశ్రమపై మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఓరియేంటేషన్ కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

● **కొడంగల్:** ఒగ్గు కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉస్తాద్ ఒగ్గు రవి, రాష్ట్ర కోశాధికారి బుగ్గన్న, చుక్క అంజయ్య, మైపాల్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శాంతప్ప, ప్రధానకార్యదర్శి బీరప్ప డిమాండ్ చేశారు. ఒగ్గు కళాకారుల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం కొడంగల్‌లో సంక్షేమయాత్ర నిర్వహించారు.

● **కీసర రూరల్:** నాగారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రాజేందర్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు.

● **మేడ్చల్ టౌన్:** మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని పార్కుస్థలంలో మంగళవారం మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి పూలమొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● **తాండూరు:** తాండూరు ప్రిపుల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ఉత్తంచంద్ పాల్గొన్నారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, అకాడమి డైరెక్టర్ సత్యనంద్ పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** ఈనెల 8, 9తేదీల్లో తాండూరులో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా మహాసభల కరపత్రాన్ని మంగళవారం నాయకులతో కలిసి విడుదల చేశారు.

● **వికారాబాద్:** ఈనెల 3వ తేదీన వికారాబాద్‌లోని తేజపంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్ కం సెలెక్షన్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.అనంతయ్య తెలిపారు. వివరాలకు 9701586893 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

● **మర్పల్లి:** మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ మధుకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వికారాబాద్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి తానేనని ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదని, మెతుకు ఆనంద్ వెంబడే ఉంటూ పనిచేస్తామని మాజీ జడ్పీటీసీ మధుకర్ అన్నారు.

● **ధారూరు:** మండల కేంద్రంలోని శ్రీ భారతి విద్యామందిర్‌లో సోమవారం శ్రీ సాయి దంత వైద్య కళాశాల సహకారంతో ఉచిత డెంటల్ క్యాంపును నిర్వహించగా ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి హాజరయ్యారు.

● **కొడంగల్:** చెరువులు, కాలువల పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సరైనదేనని కొడంగల్ నియోజకవర్గ మైనారిటీ నాయకులు ఎస్ఎం. గౌసన్, ఆసిఫ్‌ఖాన్, సయ్యద్ హమీద్‌అలీ, సిరాజుద్దీన్ అన్నారు. మంగళవారం వారు కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడారు.

● **బొంరాస్‌పేట్:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బొంరాస్‌పేట్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముద్దాయిపేట వెంకటేశ్, గౌరవ అధ్యక్షురాలిగా శ్రీప్రియ, మండల ప్రధానకార్యదర్శిగా బాకారం చంద్రశేఖర్, కార్యదర్శిగా సేవ్యానాయక్, కోషాధికారిగా ఈశ్వరయ్య, మహిళా కార్యదర్శిగా భానును ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

● **తాండూరు:** సిద్దిపేట జిల్లా గురువన్న పేట్‌కు చెందిన గౌరైకాపారుల సామాజిక వర్గానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని తాండూరు కురుమ సంఘం నాయకులు తాండూరు డివిజన్ అధ్యక్షులు పూజారి పాండు, మాజీ అధ్యక్షులు నర్సింహులు, నాయకులు మహేష్, సాయిపూర్ మల్లేశం డిమాండ్ చేశారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేటలో టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు రాజిగళ్ల భూపాల్ అధ్యక్షతన మంగళవారం ఉమ్మడి శామీర్‌పేట మండల మీడియా ప్రెస్ క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాల్‌రాజ్ విచ్చేశారు.

● **బొంరాస్‌పేట్:** వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన వ్యాసరచన పోటీల్లో బొంరాస్‌పేట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఝాన్సీ మొదటి బహుమతి సాధించగా హారతి ద్వితీయ బహుమతిని సాధించారు. అదే విధంగా డ్రాయింగ్ పోటీల్లో 8వ తరగతి పవన్‌కుమార్ మొదటి బహుమతి, చైతన్యకుమార్ ద్వితీయ బహుమతులను జిల్లా ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా అందుకున్నారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండల ఐనెల్లి గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో నిర్వహించిన పోటీల్లో కబడ్డీ విభాగంలో పురుషుల విభాగానికి చెందిన విద్యార్థులు మొదటి బహుమతి సాధించి విజేతగా నిలిచినట్లు పాఠశాల పీఈటీ యాదగిరి తెలిపారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి శ్రీధర్, అరవింద్, నందకిషోర్ ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో అభినందించారు.

తాండూరు: తాండూరులో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డికి, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి మంగళవారం హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు సంతోష్, నాగారం మల్లేశ్, పర్యాదరామకృష్ణ, అంతారం కిరణ్, లక్ష్మణ చారి వినతిపత్రం అందజేశారు.

వికారాబాద్: హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడంతో మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చేందుకు వెళుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున స్వచ్ఛత హీ సేవా-2024 2కే రన్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. తూంకుంటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పల్లవి ప్రొగ్రెసివ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు, కరస్పాండెంట్ మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, కోఆర్డినేటర్లు దివ్య, స్వప్న, నైనీక, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 1: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట ఐపీఈ కళాశాలకు చెందిన విద్యార్థి జైబ్ ఎగ్బాల్(25) మంగళవారం తన యాక్టివా బైక్‌పై హైటెక్ సిటీ నుంచి బయల్దేరి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు మీదుగా శామీర్‌పేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో మునీరాబాద్ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో జైబ్ ఎగ్బాల్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రైలుకింద పడి యువకుడు..

మేడ్చల్ టౌన్, అక్టోబరు 1: రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారి రైలుకింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపాడ గ్రామానికి చెందిన ఎం.దేవేందర్(30) మంగళవారం ఉదయం మేడ్చల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు రైలుకింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ.. తప్పిన ముప్పు



లారీ ఢీ కొట్టడంతో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

తాండూరు రూరల్, అక్టోబరు 1: మండలంలోని అంతారం పరిధిలో సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(ఏపీ29జెడ్3918) తాండూరు వస్తుండగా తాండూరు బైపాస్ రోడ్డులో మిర్యాణం నుంచి నాపరాతి లోడ్‌తో వస్తున్న లారీ(కేఏ 39 6096) బస్సును ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అన్సర్, లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గమనించి సైడ్ తీసుకున్నారు. అప్పటికే బస్సుకు ముందు భాగంలో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. బస్సు ముందుభాగంలో అద్దాలు పగిలిపోయాయి. ప్రమాద సమయంలో బస్సులో విద్యార్థులతో పాటు ప్రయాణికులు 80మంది ఉన్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో తాండూరుకు చెందిన ఆర్టీసీ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తాండూరు పోలీసులకు సమాచారం అందించి బస్సు డ్రైవర్ అన్సర్, కండక్టర్ సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

పూడూరు, అక్టోబరు 1: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో గత నెలలో జరిగిన నిమజ్జన ఉత్సవాల్లో విధుల్లో ఉన్న పోలీసుల పట్ల కొంతమంది అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు దూషించారు. ఈ మేరకు పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ కానిస్టేబుల్ చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అల్లర్లకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించారు. పూడూరుకు చెందిన సుజాత, మల్లెగట్ల మల్లేశం, ఎర్ర శ్రీనివాస్, గొర్రెంక అనిల్, ఈడిగి నర్సింహులు, చాకలి పాండు, పిచ్చకుంట్ల శ్రీశైలం, మడిముల జంగయ్య, ప్యాట శేఖర్‌లను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిని దోమ మండల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి వైద్య పరీక్షల నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వికారాబాద్ జూడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

నిర్మాణంలో ఉన్న ఇంట్లో నుంచి విద్యుత్ వైరు చోరీ

కీసర రూరల్, అక్టోబరు 1: నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి నుంచి విద్యుత్ వైర్లు చోరీ అయ్యాయి. ఈ ఘటన మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధి బృందావన్ కాలనీలో జరిగింది. బాధితుడు మనీష్‌పటేల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ బృందావన్ కాలనీలోని ప్లాట్ నంబర్ 24, 25ల్లో నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్ సరఫరాకు వైరింగ్ పని చేయించారు. కాగా మంగళవారం తెల్లవారు ఝామున 3గంటలకు ముగ్గురు దొంగలు ఇంట్లో చొరబడి వైర్‌పు పూర్తిగా అపహరించుకుపోయారు. వారి కదలికలు సీసీ కెమెరాల్లో పూర్తిగా రికార్డైనట్లు వివరించారు. దొంగలు ఎత్తుకెళ్లిన వస్తువు విలువ దాదాపు రూ.4లక్షల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్

వికారాబాద్, అక్టోబరు 1: తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయాధికారులు, న్యాయవాదులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీపురులు పట్టుకుని చెత్త ఊడిసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి డి.శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతి దూత, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాయూమ్, న్యాయవాదులు యాదవరెడ్డి, మాదవరెడ్డి, శంకరయ్య, యాదయ్య పాల్గొన్నారు.

పరిగి: పరిగి మున్సిఫ్ కోర్టు అవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ జ్యోత్స్న ఆధ్వర్యంలో కోర్టు పరిసరాల్లో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెంచిక్లర్క్ అనిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యవర్గులు శ్రీనివాస్, భక్తకుమార్, న్యాయవాదులు రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు దశలవారీగా అమలు

పరిగి, అక్టోబరు 1: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పరిగి మండల పార్టీ అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇబ్రహింపూర్, గడిసింగాపూర్, మల్కాయపేట్, హిర్యానాయక్‌తండాల్లో మంగళవారం మహలక్ష్మీ పథకం కింద రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ కరీం, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, నాయకులు ఎం.సత్యనారాయణరెడ్డి, రాజపుల్లారెడ్డి పాల్గొన్నారు.

కులకచర్ల: అర్హత కలిగిన మహిళలకు సబ్సిడీ గ్యాస్ అందుతుందని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు తెలిపారు. చౌడాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సబ్సిడీ గ్యాస్ గుర్తింపు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్,నర్సింహనాయక్, వెంకటయ్యగౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేవీ రాడార్ విషయంలో అసత్య ప్రచారం మానుకోవాలి

వికారాబాద్, అక్టోబరు 1: దామగుండంలో నేవీ రాడార్‌స్టేషన్ విషయంలో కొన్ని పార్టీలు, సంఘాలు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని సేవ్ దామగుండం జేఏసీ నాయకులు వైగీత మహేందర్, పి.రామకృష్ణ, శ్రీనివాస్ నాయక్, మల్లేశ్, నర్సింహులు అన్నారు. స్థానిక క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వ్ ఫారెస్ట్‌లో అసలు చెట్లే లేవని 0.4 మాత్రమే అడవి ఉందంటూ ఫారెస్ట్ అధికారులు తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని, ఇవేమీ గమనించకుండా కొన్ని సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. వాస్తవాలను తెలుసుకొని సహజ సిద్ధమైన అనేక ఔషధ గుణాలు కలిగిన అడవిని విధ్వంసానికి గురికాకుండా కాపాడాలని కోరారు. తాము నేవీ రాడార్ స్టేషన్‌కు వ్యతిరేకం కాదని, అడవులు లేని ఎడారి ప్రాంతంలో వేరే చోట ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేష్, సతీష్, శ్రీకాంత్, రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ రాడాన్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి

బంట్వారం: నేవీ రాడార్‌ను దామగుండంలో కాకుండా వేరే ప్రాంతానికి తరలించాలని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు చైతన్య కిరణ్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం వికారాబాద్‌లోని దామగుండంలో నేవీ రాడార్‌కు వ్యతిరేకంగా త్వరలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. దామగుండం జేఏసీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి, బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిరసనలో భాగంగా రూపొందించిన పాటను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు.

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో తాండూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పూజలు

తాండూరు రూరల్, అక్టోబరు 1: తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మను తాండూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివలీల దర్శించుకున్నారు. మంగళవారం మెజిస్ట్రేట్ పెళ్లిరోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నవీన్‌రెడ్డి మెజిస్ట్రేట్‌ను శాలువాతో సన్మానించారు.